# కథ

# తెలింగాణం

మత్తి భానుమూర్తి
99893 71284

జ్యేష్ఠ మాసపు తొలి రోజులు..

కాకతీయ సామ్రాజ్యంలోని అనుమనగల్లు మండల ప్రధాన రహదారి.. యవనాశ్వంపై ఓ యువకుడు దిగాలుగా అటూఇటూ చూస్తూ వెళ్తున్నాడు.

మహోన్నత కాకతీయ సామ్రాజ్యం పతనమై.. ఢిల్లీ సుల్తానుల పాలనలో తెలుగునేల బావురుమంటూ విలపిస్తున్నకాలం. బాటకు అటూఇటూ విధ్వంసమై ఉన్న గుళ్లు, ఇళ్లు, భవనాలు! ఒకప్పుడు కళకళలాడగా చూసిన జన్మభూమి.. ఇప్పుడు సౌభాగ్యాన్ని కోల్పోయిన తల్లిలా కాంతివిహీనంగా కనిపిస్తుంటే.. దిగాలుగా చూస్తున్నాడు. ఓ సాధారణ యువరైతు ఆహార్యంతో ఉన్నాడతను. ఓ సత్రం వద్ద ఆగి.. లోపలికి నడిచాడు. లోపల దాదాపు పాతికమంది.. మెల్లగా కబుర్లు చెప్పుకొంటూ, అటూ ఇటూ చూసుకుంటూ తింటున్నారు. అందరిలోనూ సన్నని భయవిహ్వలత.. ఎవరో పరాయి మనిషి తమను చూస్తున్నట్లు.. ఇప్పుడో రేపో తమను తిడతాడో.. కొడతాడో.. చంపుతాడో అన్నట్లు!

సత్రం నిర్వాహకురాలి దగ్గరికి వెళ్లి..

''అమ్మా.. తినడానికి ఏమైనా ఉన్నదా?'' అన్నాడు ఆ ఆశ్వికుడు.

కుండలోని అటుకులను ఓ పళ్లెరంలో పోసి.. బెల్లం ముక్క తీసి ఆశ్వికుని చేతికి అందించిందామె.

అప్పుడే గుమ్మం వద్ద ఓ పెద్ద కదలిక వినిపించింది. అందరూ చటుక్కున అటే చూశారు. ఓ పదిమంది ఆగంతకులు. తెలుగుప్రాంతీయులు కాదు.

భారీ శరీరాలతో.. చేతుల్లో గండ్రగొడ్డళ్లు, బరిసెలు, ఇనుపతీగె చుట్టిన దుడ్డుకట్టెలు! చూపుల్లో దుర్మార్గం. కదలికల్లో అధికారం.. క్రౌర్యం!!

అరుస్తూ.. తోసుకుంటూ లోపలికి వచ్చారు. ఒకడు ధాటిగా ఆ ఆశ్వికుడి వద్దకు వెళ్లి.. అప్పుడే అందుకున్న అటుకుల పళ్లెరాన్ని వేగంగా పైకి విసిరికొట్టాడు.

''అన్నన్నన్నా.. ఆకలిగా ఉందన్నా!'' అంటూ, చటుక్కున ఆ పళ్లెరాన్ని మళ్లీ లాక్కున్నాడు ఆశ్వికుడు.

ఆ తురుష్కుడికి కోపం హెచ్చింది. ఆశ్వికుడి చేతిలోని పళ్లెరాన్ని లాగి వేగంగా పైకి విసిరికొట్టాడు.

తురుష్కులంతా ఆశ్వికుని చుట్టుముట్టి ఉరిమురిమి చూశారు. ఆశ్వికుని కుడిచెయ్యి అప్రయత్నంగా నడుమువద్దకు పోయింది. అక్కడ చురకత్తి లేదు. వెంటనే కాస్త తగ్గాడు. రేకపల్లిలో బయల్దేరుతున్నప్పుడు అన్న ప్రోలయనాయకుడు చెప్పాడు..

'లక్ష్యం సాధించాలంటే.. ఓరిమి అవసరం! ఎంత యుద్ధవీరుడివి అయినా.. ఎదురైన ప్రతివాడితోనూ ఘర్షణకు దిగకు. అందుకే చురకత్తి కూడా లేకుండా వెళ్లమని చెప్తున్నాను. అనుమనగల్లు మండలం పొలిమేరలో మనవాళ్లు నీ కోసం ఉంటారు. వాళ్లతో కలిసి నీ భవిష్యత్ కార్యకలాపాలు ప్రారంభించు!'..

మరి యోజనదూరంలో అనుమనగల్లు మండలం సమీపిస్తుంది. భయపడినట్లే ఈ సత్రం వద్ద వీళ్ల చేతుల్లో చిక్కాడు.

ఎలా తప్పించుకోవాలి?! చటుక్కున మోకాళ్లపై కిందకూర్చుని పైకిచూస్తూ చేతులు జోడించాడు.

ఆ అమాయక గ్రామీణ యువకుణ్ని ఇబ్బంది పెడుతున్న ఆ బృందం.. తమను మరో ఆశ్వికబృందం చుట్టుముట్టేవరకూ గుర్తించలేకపోయింది. దాదాపు యాభైమంది రైతుల దుస్తుల్లో ఉన్న ఆశ్వికులు అత్యంత వేగంగా పైకి వచ్చిపడ్డారు. అందినవాడినల్లా కర్కశంగా, పాశవికంగా తరుముతూ.. ఆ గ్రామీణ ఆశ్వికుణ్ని ఎత్తి మరో అశ్వంపై కూర్చుండబెట్టుకుని.. రెప్పపాటు కాలంలో అదృశ్యమైపోయారు.

మరో జాముకు ఆశ్వికునితో ఆ రైతుబృందం సుల్తాన్‌పూర్ (ఓరుగల్లు)కు కూతవేటు దూరంలోని దట్టమైన అడవుల్లో ఉన్న వాళ్ల రహస్య స్థావరానికి చేరుకుంది. ఆ ఆశ్వికుడు కాపయనాయకుడు. ఇటీవలే రేకపల్లి రాజధానిగా స్వతంత్ర తీరస్థ ఆంధ్రరాజ్యాన్ని స్థాపించిన ప్రోలయనాయకునికి తమ్ముడు. పినతండ్రి దేవయనాయకుని కుమారుడు. పిల్లలులేని ప్రోలయనాయకునికి వారసుడు. ఓరుగల్లులో పుట్టి పెరిగి.. గొప్ప కాకతీయవీరునిగా గుర్తింపు ఉన్న ముప్పై ఐదేళ్ల యువ మహాయోధుడు. ఆశ్వికబృందానికి నాయకత్వం వహించినవాడు.. అనుమనగల్లు వీరుడు అభివల్లయ.

* * *

క్రీ.శ.1330 వ సంవత్సరం. జ్యేష్ఠ మాసం.

ఏడుసార్లు ఓరుగల్లుపై దాడిచేసి చివరికి ఏడేళ్ల కింద (క్రీ.శ. 1323) ఆంధ్ర సామ్రాజ్యాధినేత, కాకతీయ మహాచక్రవర్తి ప్రతాపరుద్రుణ్ని ఓడించి.. ఓరుగల్లును సుల్తాన్‌పూర్‌గా పేరు మార్చి.. తురకరాజ్యాన్ని ప్రారంభించాడు ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్.

జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న ఆంధ్రసామ్రాజ్యం.. ఢిల్లీ సుల్తానుల



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.